నమస్తే తెలంగాణ

# నాగర్‌కర్నూల్

5 | మహబూబ్‌నగర్, ఆదివారం 23 జూన్ 2024 | NAGARKURNOOL


## గిరాకీ వాపస్ పోతుంది..



ఈ ఆర్నెళ్లుగా కరెంటు కోతలు ఎక్కువైనయ్. కొత్త గవర్నమెంట్ రాకముందు బాగుండె. పొద్దస్తమానం కరెంటే అస్సలు పొయ్యేదికాదు. ఎప్పుడన్నా పోయినా వెంటనే వచ్చేది. వ్యాపారం కూడా మంచిగా సాగేది. ఇప్పుడేమో ఎప్పుడు పోతదో.. ఎప్పుడు వస్తదో తెలుస్తలేదు. కేసీఆర్ సారు ఎట్లిచ్చిండో కానీ ఇప్పుడైతే అప్పటిలాగ ఇస్తలేరు. గంట గంటకూ కరెంటు పోతుంటే గిరాకీ వాపస్ పోతుంది. ఇన్ని రోజులు జనరేటర్ అవసరం లేకుండె. అర్జెంట్ ఉన్నప్పుడు జనరేటర్‌ను పెట్టుకొని జిరాక్స్‌లు తీయాల్సి వచ్చింది. గిరాకీ పోవొద్దని జనరేటర్ పెట్టి జిరాక్స్ తీసిచ్చినా కస్టమర్ ఇచ్చేది రెండ్రూపాయలే. జనరేటర్ పెట్టినందుకు రూపాయి ఎక్కువ ఇవ్వమన్నా ఇవ్వరు. గిరాకీని వాపసు పంపలేక తిప్పలు పడుతున్న. జనరేటర్ పెట్టి వ్యాపారం చేయలేం. పదేండ్లకు ముందు వ్యాపారాలు చేసిన రోజులు గుర్తొస్తున్నయ్. ఇట్లే ఉంటే వ్యాపారం చేయడం కష్టమైతది. చాలామంది కరెంటును నమ్ముకునే వ్యాపారాలు చేసుకుంటరు. వాళ్లంతా ఇబ్బంది పడే పరిస్థితులొస్తయి. అప్పటి పరిస్థితులు తలుచుకుంటేనే భయమైతుంది. టైంకు కరెంట్ లేక వ్యాపారాలు లేక, షాపులు మూసేసుకునేటోళ్లం. తెలంగాణ వచ్చినంక కరెంట్ తిప్పలు తప్పినయ్ కానీ.. కాంగ్రెసోళ్లు వచ్చినంక పరిస్థితి దారుణమైంది. పరిస్థితులు ఇట్లే కొనసాగితే వ్యాపారాలు, పరిశ్రమలు నడపలేం. వాటిని నమ్ముకునే చాలా మంది బతుకుతున్నరు. పని ఇచ్చేవారు లేకపోతే చాలామంది కార్మికులు రోడ్డున పడాల్సి వస్తది. కేసీఆర్ ప్రభుత్వాన్ని తిట్టడం మానేసి ఏం చేస్తే 24 గంటల కరెంట్ ఇవ్వగలమని సీఎం ఆలోచిస్తే బాగుంటుంది.

*- శశిధర్, జిరాక్స్ వ్యాపారి, ఆత్మకూరు, వనపర్తి జిల్లా*

## 24 గంటల కరెంటిచ్చింది కేసీఆరే..



వ్యవసాయంపై రేవంత్‌రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడి రైతులను మోసం చేస్తున్నడు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మూడుగంటల కరెంట్‌తో మూడు మడులు కూడా పారకుండే. మళ్లీ ఇప్పుడు కూడా అదే పరిస్థితి వచ్చింది. ఉన్న పంటలన్నీ ఎండిపోతయి. వ్యవసాయం చేసే నాయకుడు కేసీఆర్‌కు కరెంట్ లేకపోతే ఎట్లుంటదో తెలుసు. మూడుగంటల కరెంట్ చాలనే రేవంత్‌కు మా కష్టాలెట్లా తెలుస్తయ్. సీఎం రేవంత్ రైతుల గురించి నీచంగా మట్లాడితే బాగోదు. రైతులకు 24 గంటల కరెంట్ ఇచ్చింది కేసీఆర్ ప్రభుత్వమే. కాంగ్రెస్ రావడంతో మాకు మళ్లీ పాత రోజులొచ్చాయి.

*- కొండారెడ్డి, రైతు, మరికల్, నారాయణపేట జిల్లా*



# ఎన్కటి రోజులొచ్చాయి



- కాంగ్రెస్ పాలనలో కరెంట్ కష్టాలు
- ఎడాపెడా కోతలతో ప్రజల ఆగ్రహం
- ఎకరా పొలానికి కూడా నీరు పారని వైనం
- రేవంత్ సర్కారుపై రైతన్న కన్నెర్ర
- కేసీఆర్ హయాంలోనే నాణ్యమైన కరెంట్

తెలంగాణ ఏర్పడ్డాక కేసీఆర్ హయాంలో కరెంట్ కాంతులు ప్రసరిస్తే.. కాంగ్రెస్ పాలనలో 'కట్'కట మొదలైంది. ఎడాపెడా కోతలపై ప్రజలు, వ్యాపారులు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏ పని సక్రమంగా చేయలేకపోతున్నామని, కరెంట్ ఉంటేనే అన్ని పనులు అవుతాయని చెబుతున్నారు. ప్రస్తుతం సరఫరా అయ్యే కరెంట్‌తో బోరు మోటర్ ద్వారా నీళ్లు ఎకరా పొలం కూడా పారడం లేదని కర్షకులు వాపోతున్నారు. బీఆర్ఎస్ పాలనలోనే నాణ్యమైన కరెంట్ వచ్చేదని, ఇందుకు కారణమైన కేసీఆర్‌ను బద్నాం చేయాలని చూడడం సరికాదన్నారు.

– మహబూబ్‌నగర్, జూన్ 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

## లేనిపోని ఆరోపణలు చేస్తున్నరు..



సాగునీటి కోసం బావులకాడనే పండుకుని పంటలకు నీళ్లు పెట్టెకునేటోళ్లం. కరెంట్ ఎప్పుడొస్తుందో? ఎప్పుడు పోతుందో? తెలిసేది కాదు. సమయం, సందర్భం లేకుండా కరెంట్ కోతలుండేవి. సక్రమంగా సరఫరా చేయకపోవడంతో మోటర్లు, ట్రాన్స్‌ఫారం కాలిపోతుండే. కరెంట్ సరిగా లేక చేతికొచ్చిన పంట పూర్తిగా ఎండిపోయి.. చేసిన అప్పులు తీరక ఎన్నో ఇబ్బందులు పడ్డాం. తెలంగాణ వచ్చినంక అప్పటి సీఎం కేసీఆర్ రైతు బాధలు తెలుసుకొని 24 గంటల కరెంట్ ఇచ్చిండు. నిరంతరం కరెంట్‌తో మూడు పంటలు సాగు చేసినం. రాత్రి పూట ఇంటికాడ పడుకొని పగటి పూట పంటలకు నీళ్లు పారించినం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినంక పాత రోజులు గుర్తొస్తున్నాయి. అన్నదాతకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అండగా నిలిచిన కేసీఆర్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారు. నిరంతరం కరెంట్ ఇచ్చిన కేసీఆర్‌ను తప్పుపట్టడం అన్యాయం.. మళ్లీ కేసీఆర్ వస్తేనే మా బతుకులు మారుతయ్.

*- బిట్ల ధర్మారెడ్డి, రైతు, మర్రిపల్లి, చారకొండ మండలం , నాగర్‌కర్నూల్ జిల్లా*

## కాంగ్రెస్ పాలనలో గోస పడుతున్నం..



మాకు కరెంటు సరిగ్గా వస్తలేదు. గాలి, వర్షం వస్తే రాత్రిపూట కరెంటు ఉండదు. నీళ్లు వస్తలేవు. కేసీఆర్ ఉన్నప్పుడు కరెంట్ పోకపోయేది. నీళ్లు మంచిగా వచ్చేవి. రైతులకు 24 గంటల ఉచిత నాణ్యమైన కరెంటిచ్చిండు. ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో కరెంట్ కష్టాలు స్టార్టైనయ్. కరెంట్ రాత్రిపూట వస్తే పొలాల్లో పడుకునే పరిస్థితి వచ్చేటట్లుంది. మాది నల్లమల అటవీ ప్రాంతంలోని పల్లెరూటుపెంట. మా పెంటలో 40 గుడిసెలున్నాయి. కొన్ని నెలలుగా మిషన్ భగీరథ నీళ్లు కూడా వస్తలేవు. ఒక్కోసారి వారం వరకు కరెంట్ ఉండదు. చాలా గోస పడుతున్నం.

*- అంజమ్మ, పల్లెరూటుపెంట, అచ్చంపేట, నాగర్‌కర్నూల్ జిల్లా*

## మొదలైన కరెంట్ కష్టాలు



కాంగ్రెస్ పాలన అంటేనే కరెంట్ కష్టాలు ఉంటాయి. పదేండ్ల కిందటి వరకు కాంగ్రెస్ పాలనలో కరెంట్ కోసం ఎన్నో కష్టాలు పడ్డాం. పగలు, రాత్రి తేడా లేకుండా పొలాల వద్ద కరెంట్ కోసం పడిగాపులు కాసినం. తెలంగాణ ఏర్పడి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినంక కరెంట్ కష్టాలు తీరాయి. కేసీఆర్ ప్రభుత్వం రైతులకు 24 గంటలు కరెంట్ ఇవ్వడంతో రెండు పంటలు సాఫీగా సాగు చేసుకున్నాం. కానీ ప్రస్తుతం మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కరెంట్ కష్టాలు మళ్లీ మొదటికొచ్చాయి. దీంతో బోరు బావుల వద్ద నాట్లు వేయాలా వద్దా అని ఆలోచిస్తున్నాం.

*- రాజేశ్వర్‌రెడ్డి, రైతు, రాకొండ, మరికల్ మండలం, నారాయణపేట జిల్లా*


---

ధన్వాడ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం తల్లిదండ్రుల పాదపూజ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలకు వచ్చిన తల్లిదండ్రుల పాదాలను విద్యార్థులు కడిగి పూజలు చేశారు. పిల్లలు ఉన్నత స్థాయికి ఎదగాలని తల్లిదండ్రులు ఆశీర్వదించారు. కార్యక్రమంలో హెచ్ఎం శెట్టి రమేశ్, సీఆర్‌పీలు నారాయణ, వెంకట్రాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

*- ధన్వాడ, జూన్ 22*



తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు



ఈశ్వరమ్మను పరామర్శించి బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, గువ్వల బాలరాజు, బీరం హర్షవర్ధన్‌రెడ్డి

- అమానుష ఘటనపై సీఎం స్పందించాలి
- ఈశ్వరమ్మపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలి
- శాంతిభద్రతల పరిరక్షణలో కాంగ్రెస్ సర్కారు వైఫల్యం
- న్యాయం జరిగే వరకు పోరాడుతాం..
- మాజీ మంత్రులు సత్యవతి, సబితా, మాజీ ఎమ్మెల్యేలు మర్రి, గువ్వల, బీరం
- నాగర్‌కర్నూల్ జిల్లా దవాఖానలో చెంచు మహిళకు పరామర్శ

# రాష్ట్రంలో రాక్షస పాలన

నాగర్‌కర్నూల్, జూన్ 22 : రాష్ట్రంలో ప్రజాపాలన లేదని, రాక్షసపాలన నడుస్తున్నదని మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, గువ్వల బాలరాజు, బీరం హర్షవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా దవాఖానలో చికిత్స పొందుతున్న కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లికి చెందిన చెంచు మహిళ ఈశ్వరమ్మను వారు పరామర్శించి రూ.1.50లక్షల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఈశ్వరమ్మపై జరిగిన పాశవిక దాడి చాలా బాధకరమన్నారు. ఈ విషయంపై సర్కారు వెంటనే స్పందించాలన్నారు. మహిళా వైద్యుల పర్యవేక్షణలో ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ప్రజాపాలన అని గొప్పలు చెబుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాక్షస పాలనకు తెరలేపిందని దుయ్యబట్టారు. మాటల్లో చెప్పలేని, ప్రజలకు చూపలేని రీతిలో అతి నీచంగా క్రూరమృగాల మాదిరిగా మహిళపై దాడి చేయడం దారుణమన్నారు. రాష్ట్రంలో ఆడబిడ్డలు బతకలేని పరిస్థితుల్లో ఉన్నారని, కొన్ని రోజులుగా రాష్ట్రంలో అసాంఘిక ఘటనలు.. చిన్నారులపై అత్యాచారాలు జరుగుతున్నా ప్రభుత్వం మొద్దు నిద్ర పోతున్నదన్నారు. తూతూమంత్రంగా స్పందించి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం చాలా బాధకరమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని రావణకాష్టంగా మార్చి పాలన సాగిస్తున్నారన్నారు. ఈశ్వరమ్మపై దాడి అనంతరం ఆమెకు మెరుగైన వైద్యం అందించడంలో వైద్యులు సైతం విఫలమయ్యారన్నారు. మహిళా డాక్టర్‌తో వైద్య సేవలు అందించకుండా డ్యూటీ డాక్టర్లతో వైద్యం చేయిస్తున్నారని విమర్శించారు. ఈ ఘటనకు ప్రభుత్వం బాధ్యత వహించి బాధిత కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, ముగ్గురు పిల్లల చదువుకు బాధ్యత తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు. మర్మాంగంపై కారం చల్లి డీజిల్ పోసి పాశవిక దాడి చేసిన నిందితులను పోలీస్ స్టేషన్‌లో ఉంచి కొత్త అల్లుడికి మర్యాదలు చేసినట్లు చేస్తున్నారని, వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతల విషయంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, సీఎం వెంటనే సమీక్ష నిర్వహించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకునేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీలతో మాట్లాడి బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు పార్టీ తరఫున పోరాడుతామన్నారు. ఒక దవాఖానలో కేవలం నలుగురు లేడీ డాక్టర్లే ఉండడం ఏమిటని ప్రశ్నించారు. బాధిత మహిళ తనపై దాడి చేసిన వారి పేర్లను స్వయంగా చెప్పినా.. వారిని కాదని వేరే పేర్లతో కేసులు పెట్టడం పోలీసుల అత్యుత్సాహానికి నిదర్శనమన్నారు. నిజంగా పేదవారిపై అభిమానం ఉం టే ఇంతటి ఘాతుకానికి పాల్పడిన మరో ముగ్గురిని సా యంత్రానికల్లా అరెస్ట్ చేయించాలని డిమాండ్ చేశారు. లేదంటే బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు. కేసులు పెడితే మళ్లీ బయటకొచ్చి తమను చంపుతారని బాధిత కుటుంబసభ్యులు భయపడుతున్నారన్నారు. సుమోటో కింద కేసు నమోదు చేసి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

# గృహజ్యోతితో 63వేల మందికే లబ్ధి

- మిగతా వారి పరిస్థితేంటి?
- 70 మినీలిఫ్టులలో మోటర్లు పనిచేయడంలేదు
- తక్షణమే వాటిని వినియోగంలోకి తేవాలి
- ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, చిత్రంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి, జూన్ 22 : గృహజ్యోతి పథకం వల్ల జిల్లాలో కేవలం 63వేల మందికి మాత్రమే లబ్ధి జరిగిందని, మిగతా వారి పరిస్థితి ఏమిటని సంబంధిత అధికారులను ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రశ్నించారు. జిల్లాలోని రైతులకు సాగునీరు అందించేందుకు అధికారులు తమకున్న అధికారాన్ని పూర్తిగా ఉపయోగించుకోవాలని ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎమ్మెల్యే మేఘారెడ్డితో కలిసి విద్య, వైద్యం, విద్యుత్, నీటిపారుదల శాఖల అధికారులతో మంత్రి, ఎమ్మెల్యే మేఘారెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సర్కారు బడుల్లోని ఉపాధ్యాయులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని సూచించారు. ప్రతి టీచర్ హాజరుపై డీఈవో, ఎంఈవోల పర్యవేక్షణ ఉండాలన్నారు. విద్యార్థులందరికీ పుస్తకాలు, యూనిఫాం సకాలంలో అందించాలన్నారు. అదేవిధంగా 2017–18లో సబ్‌స్టేషన్లు మంజూరై, పనులు పూర్తయ్యి నేటికీ ప్రారంభం కాకపోవడానికి గల కారణాలపై ఆరా తీశారు. జిల్లాలో కొత్తగా 13 సబ్‌స్టేషన్లు మంజూరు కాగా వాటిలో ఆరింటి పనులు నడుస్తున్నాయని, మరో నాలుగు టెండర్ దశలో.. రెండు స్థల స్వాధీన దశలో.. మరొకటి న్యాయస్థానం పరిధిలో ఉన్నదని అధికారులు వివరించారు. ప్రజాపాలన దరఖాస్తుల్లో సమస్యల కారణంగా ఆలస్యమవుతుందని అధికారులు వివరణ ఇచ్చారు. సాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా, కాల్వల్లో జమ్మును వెంటనే తొలగించాలని, జిల్లావ్యాప్తంగా ఉన్న 70 మినీలిఫ్టులలో మోటర్లు పనిచేయడం లేదని తమ దృష్టికొచ్చిందన్నారు. వెంటనే చర్యలు తీసుకొని వినియోగంలోకి తేవాలని ఆదేశించారు. అత్యవసర సేవల నిమిత్తం దవాఖానకు వచ్చే రోగులను మరో దవాఖానకు రెఫర్ చేసే సంస్కృతికి వైద్యాధికారులు స్వస్తి పలకాలన్నారు. రోగుల విషయంలో సిబ్బంది ఆలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ శిశు సంరక్షణ కేంద్రంలో శిశు మరణాలపై ఆరా తీశారు. ప్రభుత్వ జనరల్ దవఖానలోని విలువైన చికిత్స పరికరాలను సక్రమంగా వినియోగించుకోవాలని, నిరుపయోగంగా ఉన్న వాటిని వినియోగంలోకి తీసుకు రావాలని సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అధికారులతో శాఖల వారీగా ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, ఎం.నగేశ్, మున్సిపల్ చైర్మన్ మహేశ్, ఎంపీపీ కిచ్చారెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

# నీట్‌పై ఫైట్

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యార్థి సంఘాల ఆందోళనలు
- మళ్లీ నిర్వహించాలని డిమాండ్

పాలమూరు, జూన్, 22 : నీట్ పేపర్ లీకేజీపై విచారణ జరిపి మళ్లీ పరీక్ష నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ నాయకులు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా విద్యార్థి సంఘాలు ఆందోళనలు నిర్వహించారు. మహబూబ్‌నగర్‌లో భారీ ఎత్తున ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్ర పభుత్వం మొండి వైఖరితో గ్రేస్ మార్కులు తొలగించి జూన్ 23న మళ్లీ పరీక్ష నిర్వహించి, 30న ఫలితాలు ప్రకటిస్తామని చెప్పడం నీట్ అవకతవకలను పక్కదారి పట్టించడమేనన్నారు. ఫలితంగా నీట్ మార్కులు తారుమారయ్యే అవకాశం ఉందన్నారు. నీట్ పరీక్షపై అనేక అనుమానాలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేయకుండా ఎన్‌టీఏ ఏకపక్షంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. బీహార్, హర్యానా, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో పేపర్ లీకేజీపై విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. కేంద్రంలోని బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మాత్రమే నీట్ ర్యాంకులు అత్యధికంగా వచ్చాయని, వాటిపై కూడా సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. రీ ఎగ్జామ్ నిర్వహించి, ఎన్‌టీఏను రద్దు చేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న విచారణ ఎన్‌టీఏ చైర్మన్, డైరెక్టర్లను రద్దు చేసి వారిపై సీబీఐ విచారణ జరిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భరత్, రమేశ్, ప్రశాంత్, ఆవేశ్, లక్ష్మణ్, రాజు, సీతారాం తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

# తప్పిన పెనుప్రమాదం

- అదుపు తప్పి కారు బోల్తా..
- ముగ్గురికి తీవ్ర గాయాలు

ఉండవెల్లి, జూన్ 22 : లారీని ఓవర్‌టేక్ చేసే క్రమంలో అదుపుతప్పి చెట్టును ఢీకొని కారు బోల్తా పడి ముగ్గురికి తీవ్ర గాయలైన ఘటన అలంపూర్ చౌరస్తా శివారులో చోటుచేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా కేంద్రానికి చెందిన సాయి దిలీప్, బాబ్జున్, జిలాన్ బాషా (కేఏ 05 ఎంఎస్ 7164) కారులో శనివారం హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. ఉండవెల్లి మండలం అలంపూర్ చౌరస్తా శివారులోని ఉత్తర ఫుడ్స్ వద్దకు రాగానే లారీని ఓవర్ టేక్ చేసే క్రమంలో కారు అదుపు తప్పి వేపచెట్టును ఢీకొట్టి బోల్తా పడింది. కారులోని ఎయిర్ బ్యాగ్స్ సకాలంలో ఓపెన్ కావడంతో వారు గాయాలతో తప్పించుకున్నారు. గమనించిన స్థానికులు హైవే అంబులెన్స్‌కు సమాచారమిచ్చి కర్నూల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కాగా, ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయ్యింది.



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

# కేసీఆర్ కృషి ఎనలేనిది

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, జూన్ 22 : రైతాంగం కోసం తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ చేసిన కృషి ఎనలేనిదని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఏరువాక పండుగను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని 32వ వార్డులో తోరణం తెంపే కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చింతలపేటలో తోరణం లాగే కార్యక్రమాన్ని ఆనవాయితీగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. రైతుల కోసం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి చేయూతనిచ్చారన్నారు. ఏరువాక అంటే.. రైతుల పండుగ అన్నారు. వ్యవసాయం దండగ అన్న వారికి పండుగలా చేసిన వ్యక్తి కేసీఆర్ అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్, మురళి, రామాంజనేయులు, గోవిందు, సాయి శ్యాంరెడ్డి, సీతారాములు, నరహరి శ్రీనివాసులు, నాగిరెడ్డి, దౌలన్న, ధర్మానాయుడు పాల్గొన్నారు.

***మన సంస్కృతిని కాపాడుకుందాం***

మన గ్రామీణ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉన్నదని ఎమ్మెల్యే బండ్ల పేర్కొన్నారు. కర్ణాటకలోని రాయిచూర్‌లో ఏరువాక పౌర్ణమి సందర్భంగా పట్టణ మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ముంగారు సాంస్కృతిక కార్యక్రమాలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాడెద్దులకు అక్కడి ప్రజాప్రతినిధులతో కలిసి పూజలు చేసిన అనంతరం బండలాగుడు పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో రాయిచూర్ మాజీ ఎమ్మెల్యే పాపిరెడ్డి, జెడ్పీటీసీ రాజశేఖర్, వైస్‌ఎంపీపీ రామకృష్ణనాయుడు, నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, వేణుగోపాల్, మురళి తదితరులు పాల్గొన్నారు.



ఏరువాక పౌర్ణమి సందర్భంగా శనివారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు, బైక్‌లతో ఊరేగింపు చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హన్వాడ మండలం కిష్టంపల్లి గ్రామంలో గొర్రెపొట్టేళ్లతో బండి కట్టి ఆలయం చుట్టూ తిప్పారు.

*- హన్వాడ, జూన్ 22*